# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 8 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL


## సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి..

**కలెక్టర్ రాజర్షి షా**



సైనికుల తల్లులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 7 : దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలో సైనికుల త్యాగాలకు గుర్తుగా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలి విరాళంతో పతాక నిధి సేకరణను ప్రారంభించారు. అనంతరం రక్షణలో వీరమరణం పొందిన సైనికుల తల్లులను సత్కరించారు. ఇందులో భాగంగా వివిధ కారణాలతో మరణించిన సైనికుల కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, జనరల్ కార్యదర్శి దేవన్న, అభయ్ కుమార్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

## పరమాత్ముడి చింతనతో కష్టాలు దూరం



నర్మదేశ్వరుడి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, డిసెంబర్ 7 : పరమాత్ముడి చింతనతో కష్టాలు దూరమవుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం కైలాష్ టె కిడి నర్మదేశ్వర ఆలయ 22 వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించారు. నంది, లింగం విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. లింబాజీ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నా రు. పంచ కుండి మహా రుద్రాభిషేకంలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కైలాష్ టెకిడిలోని నర్మదేశ్వరుని ఆలయాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

# అంగన్‌వాడీల అరిగోస

**ఎనిమిది నెలలుగా పాత జీతాలే..**

- మినీ నుంచి మెయిన్ టీచర్‌గా మారినా మారని బతుకులు
- 'అప్‌గ్రేడ్' అంగన్‌వాడీ టీచర్లను పట్టించుకోని ప్రభుత్వం
- నిర్మల్ జిల్లాలో 110 మందికి చేకూరని లబ్ధి

నిర్మల్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సేవలను ఉన్నతీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రతిపాదనలు రూపొందించింది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుండా చేతులెత్తేసింది. దీంతో అంగన్‌వాడీలు తమ పోరాటాన్ని ఉధృతం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చింది. గత జనవరిలో మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పేరుకు రెండు నెలలపాటు ప్రధాన టీచర్ల వేతనాలను ఇచ్చి, మళ్లీ పాత జీతాలనే ఇస్తున్నది. దీంతో మెయిన్ టీచర్లుగా మారిన మినీ టీచర్లందరూ ఎనిమిది నెలలుగా సగం జీతాలతో సర్దుకోవాల్సి వస్తున్నది. ఈ విషయంపై ఇప్పటికే ఆందోళనలు చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన అంగన్‌వాడీలు తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించారు. అయినా పాలకులు, అధికారులు తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్లు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

### 110 మందికి చేకూరని లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా గతంలో 816 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, కొత్తగా 110 మినీ అంగన్‌వాడీ సెంటర్లను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 926 కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో మినీ నుంచి మెయిన్‌గా అప్‌గ్రేడ్ అయిన 110 మంది మినీ టీచర్లకు లబ్ధి చేకూరడం లేదు. మినీ టీచర్లకు రూ.7,500, మెయిన్ టీచర్లకు రూ.13,650 చొప్పున ప్రభుత్వం వేతనాలను చెల్లిస్తున్నది. 110 మంది మినీ టీచర్లు మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయినందున వారికి కూడా నెలకు రూ.13,650 చొప్పున వేతనాలు చెల్లించాలి. కానీ.. గత ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7,500 చొప్పున మాత్రమే ఇస్తున్నది. అంతేకాకుండా ఇచ్చే సగం వేతనం కూడా ఐదు నెలలుగా చెల్లించకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి నెలకున్నది. అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా ఆయాల నియామకం చేపట్టకపోవడంతో అంగన్‌వాడీలే అన్ని పనులు చూసుకోవాల్సి వస్తున్నది. ఇటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం వండి పెట్టడంతో పాటు, అటు ప్రభుత్వం అప్పగించిన మిగతా పనులనూ చేయాల్సి వస్తున్నది. ముఖ్యంగా ఎన్నికల విధులు, సర్వే పనుల కారణంగా ఆదివారం కూడా వారికి సెలవు లేకుండా పోతున్నది.

### రెండు నెలలే ఇచ్చారు..



*గత 15 ఏళ్లుగా అంగన్‌వాడీ మినీ టీచర్‌గా పని చేస్తున్నా. గత జనవరి 24 నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌గా పదోన్నతి కల్పించారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి మాత్రమే మెయిన్ అంగన్‌వాడీలకు ఇచ్చే రూ.13,650 వేతనాన్ని చెల్లించారు. మళ్లీ మార్చి, ఏప్రిల్ నెలల వేతనాన్ని మినీ టీచర్లకిచ్చే రూ.7,500 వేతనాన్ని ఇచ్చారు. ప్రస్తుతం ఐదు నెలలుగా ఏ వేతనం కూడా రావడం లేదు. పదోన్నతి కల్పిస్తున్నట్లు ఆర్భాటం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నది.*

***- వందన, అంగన్‌వాడీ టీచర్, బోరిగాం, ముథోల్ మండలం.***



ఆదిలాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# యేడాదిలో ఎమ్మెల్యే చేసిందేమీ లేదు

**బీఆర్‌ఎస్ పనులకు కొబ్బరికాయ కొడుతున్నారు..**

- దమ్ముంటే నిధులు తీసుకొచ్చి పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- రేవంత్‌కు కోవర్ట్‌గా మారాడు..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ యేడాది కాలంలో నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన పనులతోపాటు తాము శంకుస్థాపనలు చేసిన పనులకు ఆయన కొబ్బరికాయలు కొడుతూ ప్రజలను నమ్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలికిన పాయల్ శంకర్ కేంద్రం నుంచి తీసుకువచ్చింది ఏమి లేదని, అమృత్ పథకం నిధులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజురయ్యాయన్నారు. జైనథ్ మినీ స్టేడియాన్ని గతంలో ఎమ్మెల్యేగా తాను శంకుస్థాపన చేసిన తిరిగి ప్రస్తుతం ఎమ్మెల్యే రెండోసారి భూమిపూజ చేశారన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి, ఎయిర్‌పోర్టు, మూతబడిన సిమెంటు పరిశ్రమ, రేణుక సిమెంట్ ఫ్యాక్టరీలను ఎమ్మెల్యే విస్మరించారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సీసీఐని తిరిగి ప్రారంభించే విషయంలో తాము అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసినా స్పందన లేదని పేర్కొన్నారు. జెఎన్టీయూ కళాశాల ఏర్పాటు, కలెక్టర్ కార్యాలయం, ఐటీ టవర్, బీసీ భవన్ పనులు ఎందుకు ముందుగా సాగడం లేదో పాయల్ శంకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### ముఖ్యమంత్రి రేవంత్‌కు తొత్తుగా మారాడు..

నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తొత్తుగా మారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోవడం లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ఎందుకు మాట్లాడడం లేదన్నారు. గతంలో ఫసల్ బీమా విషయంలో ముఖ్యమంత్రి ఇంటి ముందు ధర్నా చేశానని చెప్పిన శంకర్.. ఇప్పుడు రైతులు సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేయాలన్నారు. జిల్లాలో పత్తి, సోయా రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ఒక్కసారి మార్కెట్ యార్డును సందర్శించలేదని తెలిపారు. ఏడాదికాలంలో రూ.25 కోట్ల సీఆర్‌ఎస్, రూ.10 కోట్ల టూయూఎఫ్ ఐడీసీ నిధులు నియోజకవర్గానికి వచ్చాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని తెలిపారు. రెండు పార్టీల నాయకులు తోడు దొంగలని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, విజ్జిగిరి నారాయణ, కుమ్రం రాజు, మార్సెట్టి గోవర్ధన్, బట్టు సతీశ్, గంగయ్య, అశోక్ స్వామి, గణేశ్, దమ్ముపాల్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, విఠల్, వినోద్, తదితరులు ఉన్నారు.

# శాంతియుత వాతావరణం కల్పిస్తున్నారు



సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, డిసెంబర్ 7 : శాంతియుత వాతావరణం కల్పించేలా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు. శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు వ్యవస్థలో వివిధ రంగాల్లో స్టాల్స్, సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్లతోపాటు దొంగతనాల నివారణపై తయారు చేసిన సీడీని కలెక్టర్ రాజర్షి షా, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికాపంత్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీసుల జాగిలాలు అతిథులకు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం పోలీసులు జాగిలాలు బాంబు, ఇతర వాటిని ఎలా గుర్తిస్తాయో వాటిని చూపించారు. ఆయుధాలు, ఫింగర్ ప్రింట్ సేకరణ, ఇతర వాటి గురించి తెలియజేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. ఈ క్రమంలో 10 క్వింటాళ్ల 43 కిలోల గంజాయిని పట్టుకున్నామని, దాని విలువ దాదాపు రూ.2 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో రూ.68 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. ఈ ఏడాదిలో 39 ద్విచక్రవాహనాలు, 286 సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేశామన్నారు. సైబర్ క్రైమ్ కేసుల్లో 90 మంది బాధితుల రూ.17.62 లక్షలను తిరిగి ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, ఏస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

**రెండో రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన**



మాట్లాడుతున్న పీఆర్టీయూ అధ్యక్షుడు నరేంద్ర బాబు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి రెండో రోజు చేరుకున్నది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం, సమగ్ర శిక్షలోని పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 61 ఏండ్లు నిండిన ఉద్యోగులకు రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని అన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం 9వ తేదీలోగా పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వీరికి యూటీఎఫ్, పీఆర్టీయూ సంఘ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, అశోక్‌కుమార్, పీఆర్టీయూ అధ్యక్షుడు నరేంద్ర బాబు పాల్గొన్నారు.

## గర్భిణులకు ఆటోనే దిక్కు



గుండాల గ్రామం నుంచి ఆటోలో వెల్లడానికి సిద్ధంగా ఉన్న గర్భిణులు

***102 అంబులెన్స్ మరమ్మతులకు** నోచుకోకపోవడంతో గర్భిణులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు ఖర్చు చేసుకుంటూ పదుల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. తాజాగా శనివారం గుండాల, గుంజాల, చోర్‌గావ్, కంపూర్ గ్రామాలకు చెందిన 30 మంది గర్భిణులు ఐదు ఆటోల్లో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఒక్కొక్కరు రానూపోనూ రూ.100లు ఖర్చు చేశారు. కాగా.. గర్భిణులు ఆటోలో ప్రయాణించడానికి అవస్థలు పడ్డారు. ఈ విషయంపై వైద్యాధికారి రాంబాబును వివరణ కోరగా.. అంబులెన్స్ మరమ్మతు వచ్చిందని తెలిపారు.*

*- నార్నూర్, డిసెంబర్ 7*

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం, డిసెంబర్ 7 : ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కడెం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో వారం రోజులుగా ట్రెయినింగ్ ఆఫ్ ట్రెయినర్స్ (టీవోటీ) కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన సెంటర్ ఫర్ ఫినాన్సియల్ లిటరసీ(సీఎఫ్‌ఎల్) వలంటీర్లకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, శనివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని మొత్తం 17 జిల్లాల నుంచి 162 మంది వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ తెలిపారు. దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిశా రాష్ట్రాలలో సెంటర్ ఫర్ ఫినాన్సియల్ లిటరసీ (సీఎఫ్‌ఎల్) వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, ఇందులో ప్రజలకు అవగాహన కల్పించడంతో మన రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఆర్థిక అక్షరాస్యత వైపు అడుగులు వేసేలా వారికి విస్తృత అవగాహన కల్పించాలని, ప్రజలందరికీ రోజువారి జీవితంలో అవసరమయ్యే ఆర్థిక అంశాలన్నింటిపై అవగాహన పెంపొందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ మాట్లాడుతూ.. ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీడ్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అంతకుముందు వీడ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారధి ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవల వినియోగంపై వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి ఆర్థిక అక్షరాస్యత పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు సంతోష్, నరేశ్, సీఎఫ్‌ఎల్ వలంటీర్లు నక్క ప్రశాంత్, లింగంపెల్లి రాంకిశోర్, అట్ల రాము పాల్గొన్నారు.

## మానవహారంగా ఏర్పడి నిరసన



కలెక్టర్‌చౌక్‌లో మానవహారంగా ఏర్పడిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

*ఎదులాపురం, డిసెంబర్ 7 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకుడు రవీందర్ డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో భాగంగా రెండో రోజైన శనివారం కలెక్టర్ చౌక్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. చాయ్ పే చర్చ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. ఎన్నికల కంటే ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులు ధర్నాలు చేస్తే తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్న చర్యలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాశ్, పార్థసారథి, వెంకటి, నరేశ్, సోమన్న, రాజన్న, కేశవ్ పాల్గొన్నారు.*

## పెన్షన్ పెంపు కోసం మహా ధర్నా



గుడిహత్నూర్‌లో దివ్యాంగుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

*గుడిహత్నూర్, డిసెంబర్ 7 : వికలాంగుల పెన్షన్ పెంచాలని గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం మహాధర్నా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. ఈ మేరకు వారికి బీఆర్‌ఎస్ మండల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. దివ్యంగులకు గతంలో ఉన్న పింఛన్‌ను రూ.500ల నుంచి రూ.4 వేలకు పెంచిన కేసీఆర్‌ను మరువలేమన్నారు. వెంటనే అర్హులైన వారందరికీ పెన్షన్ మంజూరు చేసి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిరుమల్‌గౌడ్, జాదవ్ భీంరావ్, బాలాజీ, కిషన్, రవి, మాధవ్, రాము, అంకుష్ పాల్గొన్నారు.*